# సారీ (saree)సో సోరీ (sorry)

–శశి, Fair Lawn, NJ

తెలుగు కల్చరల్ ప్రోగ్రాం అని చెప్పి ధారాళంగా యింగ్లీషులో లెక్చర్స్ యిస్తున్న కార్యకర్తల గురించి ఆవేశంగా మంజూతో విమర్శిస్తున్న నేను ఎవరో పిలిచినట్లు వెనక్కి తిరిగి చూచాను. అదేమిటో గుమ్మడికాయలదొంగంటే భుజాలు తడుముకున్నట్లు మనగురించి ఎవరైనా ఏదైనా అనుకుంటే ఆమడ దురంలో వున్నా మనకు తెలిసిపోతుందనుకుంటాను.

మావారూ, మంజూ వాళ్ళాయన మా వైపు నవ్వుతూ చూస్తూ ఏదో అనుకుంటున్నారు. 'అమ్మో వీళ్ళేదో మనగురించే చెప్పుకుంటున్నారు పదండి అడుగుదాం' అంటూ అటు వెళ్ళాము.

ఏదో నవ్వుతూనే అనుకుంటున్నారు కదా ఈవిడకెందుకు ఉలుకు అనుకోకండి. కర్ణుడికి సహజ కవచ కుండలాల్లాగ మా వారికి మంచికి, చెడ్డకి అన్నింటికీ పెదాలమీద అలా చిరునవ్వు వుంటూనే వుంటుంది. అందుకే ఒక్కోసారి అంటుంటా న్నేను 'ఎలాంటి విషాద వార్తనైనా నవ్వుతూ చెప్పే యిండియన్ న్యూస్ రీడర్గా బాగా పనికి వస్తారండి మీరు' అని.

'ఏవిటీ ఏదో చెప్పేసుకుంటున్నారు?' అని అడిగాను. 'నీ సారీ గురించే' అన్నారు. 'ఏమిటట' అని అడిగాను.

'వీళ్ళిద్దరూ చెప్పుకుని ఒకే షాపులో కొన్నట్లున్నారు. మా మిసెస్కి అటువంటిదే సారీ వుంది అంటున్నారు రావుగారు' అన్నారు.

'యిదేమిటండోయ్ మీరెప్పటి నుండి ఆడవాళ్ళ చీరెలు గుర్తుంచుకోవటం మొదలు పెట్టారు' అని ఆశ్చర్యంగా అడిగింది మంజు. తను ఏమయినా అనుకుంటుందేమోనని 'సరేలే రావుగారికి ఆమాత్రమైనా గుర్తుంది. మా వారికి నా చీర ఒక్కటీ గుర్తుండదు' అన్నాను గుణుస్తున్నట్లు.

'బాగుందోయ్ నువ్వు షోకేసులో బొమ్మలాగ ఒకచీర ఒకసారి కంటే ఎక్కువ కట్టవాయె యిక నాకేం గుర్తుంటుంది? సరే కాని మనమిక బయలుదేరుదామా? మళ్ళా హరీషును పికప్ చేయాలి?'

..........

అందరికీ బై చెప్పి బయటకు వచ్చేసరికి అర అంగుళం స్నో పడివుంది. హు( యిప్పుడు యింటికి వెళ్ళగానే మళ్ళీ చీరలో నుండి పేంటూ, షర్టులోకి వేషం మార్చాలి కాబోలు అనుకున్నాను. ప్రొద్దున్నే ఆయన్ను ఎలాగో ఒప్పించి తీసుకెళ్ళాను ప్రోగ్రాంకి, సాయంత్రం హరీషును నేను పికప్ చేసుకుంటానని.

కారు సీట్లోకి వాలి కళ్ళు మూసుకున్నాను. నిజమే ఆయన అన్నట్లు, ఒక చీర, ఒకసారి కంటే ఎక్కువ కట్టే అవకాశమే రాదు. ఏదో ఈ కల్చరల్ ప్రోగ్రామ్స్, సాహితీ సమావేశాలూ, గెట్టుగెదర్స్ పుణ్యమా అని అప్పుడప్పుడయినా చీర కట్టే అవకాశం వస్తుంది. లేకపోతే ఈ పాటికి చీర ఎలా కట్టుకోవాలో కూడా మర్చిపోయేదేమో తను అంటే అతిశయోక్తి కాదు.

మొదట్లో నా దేశ సంస్కృతి నేను ఎందుకు కాదనుకోవాలి అనుకుంటూ చీర కట్టుకుని వెళ్ళేది వర్కుకి. కాని ఆ బస్సులో అదీ మిగిలిన ప్రయాణీకులు వింతగా చూడకపోయినా తనకు తనే వాళ్ళలో విడిగా తీసిపెట్టినట్లు అనిపించి డ్రస్సులు, పేంటు షర్టు వేసుకోవటం మొదలు పెట్టింది. అదీకాక చీరతో స్నోలో నడవటం కష్టంగా వుండేది. అందుకే కాబోలు 'Be a Roman while you are in Rome' అని సరిపెట్టుకుంది. కనీసం శని, ఆదివారాలయినా సారీ కట్టుకుందామంటే పిల్లల్ని బాల్గేమ్స్కి డ్రాప్ చేయటంపికప్ చేయటం, మ్యూజిక్ క్లాసెస్, కరాటీ లెసెన్స్, గ్రోసరీ షాపింగ్ యిలా అనుకుంటూ ప్రొద్దున్నే నైటీలోనుండి పేంటూ, షర్టులోకి పరకాయ ప్రవేశం. యిక చీరలు మార్చి, మార్చి కట్టే అవకాసం ఎక్కడ?

చిన్నప్పటి నుండి తనకు చీరల పిచ్చి ఎక్కువే. అందులో కాటన్స్, నేత చీరలంటే మరీను. కాని గంజిపెట్టి యిస్త్రీ చేసుకునే వీలూ, తీరిక లేక అవి తీసుకురాదు. అందుకే యిండియా వెళ్ళినప్పుడు రోజూ కాటన్ చీరలే కడుతుంది. అమ్మయితే ఒకటే గొడవ. 'నువ్వు వచ్చావని చూడటానికి ఎవరో ఒకరు వస్తారు కాస్త మంచి చీరలు కట్టుకో తల్లీ' అని ఒకరోజు యిలాగే సాయంత్రం వరకూ కూర్చుని, ఏం తోచటం లేదని సినిమాకి బయలుదేరాం. 'అదేమిటే చీరైనా మార్చుకోకుండా అలాగే వెళ్ళిపోతావా' అంది అమ్మ. 'అబ్బా పోనీలే అమ్మా నాకు ఈ కాటన్ సారీవే యిష్టం' అన్నాను. 'అసలు మీ అమ్మాయిని ఒక నేత చీరలు నేసే వాడికి కట్టబెట్టాల్సింది అత్తయ్యగారూ' అని ఈయన జోకు చేసారు. ఈయన మాటతీరు తెలియని మా డ్రైవరు 'బాబుగారు భలేగా మాట్లాడుతారు' అని ముఫ్ఫై మెలికలు తిరిగిపోయాడు. అబ్బో యిదేనా ఈయన నా చీరల పిచ్చి గురించి చాలానే జోకులు చేస్తుంటారు. ఒకసారి అమ్మ 'నీకు నైటీ అలవాటు కదా, యిలా వుక్కా, వేడి అంటూ ఆ చీరలో పడుకుంటావెందుకే' అంటే ఈయనగారు వెంటనే అందుకొని 'అబ్బో మీ అమ్మాయికి, గుఱ్ఱం మీద రాకుమారుడిలా రాత్రిళ్ళు నేను కలలోకి వస్తానట అందుకే ఎప్పుడూ నాకోసం అలా తయారయి వుంటుంది' అన్నారు.

కారు ఆగినట్లు అనిపించి 'ఆ అప్పుడే యిల్లు వచ్చేసిందా అంటూ ఆలోచనల్లోనుండి తేరుకుని లేచాను'. 'యిల్లురాలేదు మనమే యింటికి వచ్చాం' అన్నారుమా వారు నవ్వుతూ. మీ అరువు జోకుకి నేనేమో నవ్వను లెండి అన్నట్లు ఆయన వైపు ఒక చూపు విసిరి యింట్లోకి నడిచాను.

చీర మడతబెట్టి హేంగ్ చేస్తూ అనుకున్నాను. వీటిలో సగం పైగా యింకా కట్టనే లేదు. మళ్ళా అవి అలాగే యిండియా తీసుకు వెళ్తే అమ్మమ్మ గోల పెడుతుంది. పోయిన సారి వెళ్ళినప్పుడూ అంతే, అమ్మమ్మ ఒకటే గొడవ. 'అదేమిటే కొన్న చీరలు అసలు మడతలైనా విప్పలేదు అలాగే తీసుకు వచ్చేసావు, తిరిగి మళ్ళీ కొంటున్నావు వేలు, లక్షలు తగలపోసి. అయినా యిదేం చోద్యమే తల్లీ మా చిన్నప్పుడు యింటి ముందుకి నారాయణ పేట, వెంకటగిరి చీరల మూటలు వస్తే వాటిలోనే కొనుక్కునేవాళ్ళం. మీలాగ చీరలకోసం కంచి, బెంగుళూరు, మైసూరు అంటూ అంతంత దూరం వెళ్ళలేదే తల్లీ.' అని ఆశ్చర్యపోయింది.

'నీకు తెలియదులే అమ్మమ్మా. అప్పుడే యివి కొని రెండు, మూడు సంవత్సరాలు అయింది కదా పాత ఫ్యాషన్ అయిపోయాయి. లేటెస్ట్వి కొనుక్కోవాలి మళ్ళీ' అంటే 'ఆమాత్రం దానికి అన్నేసి కొనుక్కోవడమెందుకే?'అని అడిగింది. 'ఏదో ఆశ అమ్మమ్మా షాపులో చూచినప్పుడు వాటి డిజైన్లూ అవీ చూసి ముచ్చట పడి ఎప్పుడైనా కట్టుకొనే అవకాశం రాకపోతుందా అని కొనేసుకుంటాను. కానీ అన్ని అవకాశాలు రేనే రావు ఒక్కోసారి. అందుకే తిరిగి తీసుక రావటం అవుతుంది' అన్నాను.

'ఏమిటోనమ్మా మీ జీవితాలు అజీర్తి రోగి ముందు పంచభక్ష్య పరమాన్నాలు వెండి పళ్ళెంలో వున్నా తినలేనట్లు, వుండి అనుభవించ లేనితనం' అని గొణుక్కుంటూ అక్కడమండి వెళ్ళపోయింది.

............

'ఏమోయ్ టైమవుతుంది వస్తున్నావా లేదా. కాఫీ చేసాను వేడిగా తాగి వెళ్ళవుగాని రా' మావారి పిలుపుకి ఆలోచనల్లోనుండి తేరుకుని, కిచెన్ లోకి నడిచాను.